క్లుప్తంగా

పార్క్ ప్రారంభం



పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ సత్యనారాయణ

ఏయూక్యాంపస్: స్థానిక 20వ వార్డు ఈస్ట్‌పాయింట్ కాలనీలోని చిన్నారుల పార్క్‌ను శనివారం పార్లమెంట్ సభ్యులు, తూర్పు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. జీవీఎంసీ నిధులు రూ.5 లక్షలతో పార్క్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ప్రతీ వార్డులో అభివృద్ధికి భారీగా నిధులు అందిస్తూ ప్రజలకు ఉపయుక్తంగా కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ నాయకులు మువ్వల సురేష్ పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఇన్ఫర్మేషన్ కమిషనర్



ఇన్ఫర్మేషన్ కమిషనర్ శామ్యూల్‌జొనాథన్‌ని సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జొనాథన్ సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డితో కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున శామ్యూల్ జొనాథన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం

ఎంవీపీకాలనీ: సామవేదం షణ్ముఖ శర్మ హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో శనివారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనములు మూడు రోజులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక చైతన్యం కలిగివుండాలన్నారు. శ్రీ తులసీదాస్ మానవాళికి అందించిన హనుమాన్ చాలీసా జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఒడిసిపట్టాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతిమైన జీవితం సాకారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీసులు తీసుకున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



గాంధీనగ్‌లో పక్కకు వాలిపోయిన విద్యుత్ స్తంభం

ఆరిలోవ: జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి గాంధీనగర్‌లో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. కాలనీలో గెడ్డ అంచున 172/ఎ/1 నంబరు విద్యుత్ స్తంభం కొద్ది రోజుల క్రితం పక్కకు రోడ్డువైపు వాలిపోయింది. దీంతో ఇళ్ల నుంచి ఆ స్తంభానికి ఉండే విద్యుత్ కనెక్షన్లు కోసం అమర్చిన వైర్లు వదులుగా మారి కొన్నిచోట్ల కిందకు వేలాడుతున్నాయి. పక్కకు వాలిపోయిన విద్యుత్ స్తంభం ఎప్పుడు పడిపోతుందోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నువ్వా.. నేనా.. సై

- క్రీడా స్ఫూర్తిని చాటుతున్న క్రీడాకారులు
- ఉత్సాహంగా పాల్గొంటున్న యువత



క్రీడల మస్కట్ కిట్‌తో ఓ జ్ఞాపకం



కబడ్డీలో తలపడుతున్న కడప, చిత్తూరు బాలికల జట్లు

ఏయూక్యాంపస్ : అడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ప్రథములుగా నిలిచిన క్రీడా జట్లు నువ్వా...నేనా అన్నట్లు పోటీ పడుతున్నాయి. టైటిల్ సాధించాలనే లక్ష్యంతో తీవ్రంగా శ్రమిస్తున్నాయి. తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను ప్రదర్శించి ట్రోఫీ సాధించాలనే తపనతో సర్వశక్తులొడ్డుతూ పోటీపడుతున్నారు.

గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు..
కేవలం సచివాలయం పరిధిలో గ్రామస్థాయిలో ప్రతిభ కలిగిన వారిని క్రీడా కారులుగా ప్రోత్సహించడం నుంచి ప్రారంభమైన ఈ పోటీలు నేడు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేసే స్థాయి వరకు సాగింది. ప్రతీ జిల్లా నుంచి వచ్చిన క్రీడా బృందాల్లో మెరికల్లాంటి యువత తమ క్రీడా ప్రతిభతో అబ్బురపరుస్తున్నారు. విజయం సాధించేవరకు విశ్రమించేది లేదన్న చందంగా బరిలో దిగి తమ సత్తా చాటుతున్నారు.



ఖోఖోలో పోటీ పడుతున్న కడప, తిరుపతి జట్లు

యువతంతా ఒకేచోట..
పేరుకుతగ్గట్టుగానే ఆడుదాం...ఆంధ్రా రాష్ట్రంలోని యువతను ఐక్యం చేసింది. వారిలో క్రీడా స్ఫూర్తిని, శారీరక వ్యాయామం, ఆరోగ్య, లక్ష్యసాధనపై దృష్టి సారించే దిశగా నడిపించింది. వివిధ జిల్లాలు, ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను, వారి ప్రతిభను వీక్షిస్తుంటే ఆంధ్రరాష్ట్ర యువతంతా ఒక్కచోట చేరారా అన్నట్టుగా ఉంది.

వాతావరణం అనుకూలించింది
మంచి సంకల్పంతో చేసే పనికి దైవం సహాయం అందిస్తుంది. విశాఖలో జగుతున్న క్రీడ పోటీలకు ప్రకృతి కూడా అనుకూలిం చింది. శనివారం ఉదయం నుంచి ఆకాశం కాస్త మేఘావృతమై దర్శనమిచ్చింది. వాతావరణం చల్లగా ఉండటంతో క్రీడాకారులు ఎటువంటి అలసట లేకుండా ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

యువతకు గుర్తింపు



గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న యువతకు అరుదుగా ఇటువంటి అవకాశాలు వస్తాయి. కేవలం కొద్దిమంది మాత్రమే క్రీడల్లో పాల్గొనడం జరుగుతుంది. దీనికి భిన్నంగా పెద్దసంఖ్యలో యువత క్రీడల్లో భాగస్వాములు కావడానికి ఇది వేదికగా నిలిచింది. వివిధ స్థాయిల్లో విజేతలుగా నిలిచిన మాకు ఆర్థిక ప్రోత్సాహం అందించారు.
–టి.లక్ష్మీ సాయి దుర్గ, టి.పల్లవి, వాలీబాల్ క్రీడాకారులు

గ్రామ స్థాయి నుంచి ప్రోత్సాహం



గ్రామస్థాయిలో జరిగిన పోటీల నుంచి నేడు రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న పోటీల వరకు ఎంతో ప్రోత్సాహం అందించారు. గ్రామ స్థాయి క్రీడాకారులను గుర్తించడం, జట్టును తయారు చేయడం కొంత క్లిష్టమైన అంశం. అయినప్పటికీ ఎంతో ప్రణాళికతో ఈ పోటీలను నిర్వహించారు. యువతను సమైక్యం చేయడానికి ఈ పోటీలు ఎంతో బాగా ఉపయోగపడ్డాయి. రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు సైతం లభిస్తోంది. **–కె.హేమ, వాలీబాల్ క్రీడాకారిణి**

ప్రతిభను గుర్తించి పోత్సహిస్తున్నారు



క్రీడల్లో పాల్గొనాలని చాలా మందికి కోరిక ఉంటుంది. ఇది చాలా సందర్భాల్లో సాధ్యం కాదు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు యువతలో ప్రతిభను వెలికితీయడానికి ఉపకరిస్తున్నాయి. పోటీల నిర్వహణ చాలా ప్రణాళికాబద్ధంగా జరుగుతోంది. వసతి, భోజనం, దుస్తులు వంటి అన్ని సదుపాయాలు అధికారులు అందించి, క్రీడల్లో ప్రోత్సహించడం సంతోషాన్నిస్తోంది. **– వి.జ్యోతి, అల్లూరి జిల్లా**

19వ వార్డులో ఎంపీ ఎంవీవీ పాదయాత్ర



జాలరిపేట వాసులతో ఎంపీ ఎంవీవీ తదితరులు

ఎంవీపీకాలనీ: విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర శనివారం 19వ వార్డులో కొనసాగింది. ప్రజలు నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజకవర్గంలో విస్తృతంగా ఈ యాత్ర కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ యాత్రలో భాగంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ 36వ రోజు 19వ వార్డులోని పెదజాలరిపేటలో వార్డు ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మీతో పాటు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు నిరాజనాలు అందుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించడంతో వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. సచివాలయాల ఏర్పాటుతో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయని, అవినీతి అనే మాట ఎక్కడ వినిపించడంలేదని ఎంపీ ఎంవీవీ వెల్లడించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి సంక్షేమ పాలనకు బ్రహ్మరథం పట్టాలని పిలుపునిచ్చారు. జాలరిపేట కార్యకర్తల ఇంట్లో పార్టీ నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా దినోత్సవం



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని శ్రీ చైతన్య స్కూల్‌లో స్కూల్ క్రీడా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ రీజినల్ ఇన్‌చార్జ్ అహ్మద్ అలి ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు పలు క్రీడాపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం వరకు జరిగిన ఈ క్రీడల్లో విజేతలుగా నిలిచిన చిన్నారి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపైనా విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలనే లక్ష్యంతో ఈ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ వైఎస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎమ్.రాజు, ప్రైమరీ స్కూల్స్ విశాఖ జోన్ ఇన్‌ఛార్జ్ జ్యోతి, నిమ్మి వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



విద్యార్థిగా ఉన్నప్పటి ఫొటో



నేడు తాము చదువుకున్న విభాగం వద్ద

- విభాగంలో సందడి చేసిన పూర్వవిద్యార్థులు
- 1992–94 బ్యాచ్ కెమిస్ట్రీ విద్యార్థుల సందడి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో మూడు దశాబ్దాల క్రితం విద్యార్థిగా చేరిన వారంతా కలుసుకున్నారు. శనివారం కెమిస్ట్రీ విభాగం దీనికి వేదికైంది. 1992-94 సంవత్సరంలో ఏయూలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సును చదువుకున్న సుమారం యాభై మంది విద్యార్థులు సమావేశమయ్యారు. ఉదయం విభాగాన్ని సందర్శించారు.

తాము చదువుకున్న విభాగాన్ని, తరగతి గదులు, ప్రయోగశాలలను చూసి కళాశాల రోజులను గుర్తు చేసుకున్నారు. నేడు దేశ విదేశాలలో అత్యున్నత స్థానాలలో స్థిరపడిన వీరంతా చిన్నపిల్లల్లా మారిపోయి పాత జ్ఞాపకాలతో జ్ఞప్తికి తెచ్చుకున్నారు. కళాశాలల్లో తమకు బోధన చేసిన గురువులను గుర్తుచేసుకున్నారు. తమ ఉన్నతికి కారణమైన విశ్వవిద్యాలయానికి, విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు.

19న కళాతపస్వి కె.విశ్వనాథ్ జయంతి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

డాబాగార్డెన్స్ : కళా తపస్వి డాక్టర్ కె. విశ్వనాథ్ 94వ జయంతిని పురస్కరించుకుని 19వ తేదీన ఎంవీఆర్ ఈవెంట్స్, యాక్మీ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'విశ్వనాథం'సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కళాభారతి ఏసీ ఆడిటోరియం వేదికగా ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్న స్వరాభిషేకం సినీ సంగీత విభావరిని విజయవంతం చేయాలని కోరారు. ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్, సంగీత దర్శకుడు నేమాని పార్థసారథికి కె. విశ్వనాథ్ సంగీత పురస్కారం అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో యాక్మీ ప్రతాప్, ఎంవీఆర్, కిన్నెర థియేటర్ అధినేత రఘురాం, ప్రముఖ తెలుగు ప్లేబ్యాక్ సింగర్, సంగీత దర్శకుడు నేమాని పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

వాలెంటైన్ డేను బహిష్కరించండి

సీతమ్మధార : ఈనెల 14వ తేదీన వాలెంటైన్ డేను బహిష్కరించాలని కోరుతూ ద్వారకానగర్‌లోని ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ జనజాగరణ సమితి స్వచ్ఛమైన ప్రేమకు, ప్రేమికులకు, ప్రేమ పెళ్లిళ్లకు వ్యతిరేకం కాదని, ప్రేమికుల రోజు పేరుతో జరిగే విచ్చలవిడితనానికి, నకిలీ ప్రేమికులకు, అమ్మాయిలపై జరిగే హింసకు, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకమన్నారు. రోమ్ దేశానికి చెందిన సెయింట్ వాలెంటైన్‌ను ఉరి తీసిన రోజును ప్రేమికుల రోజుగా జరుపుకోవాల్సిన గత్యంతరం మనకు లేదన్నారు. దేశంలో మల్టీనేషనల్ కంపెనీలు తమ వ్యాపారాలు పెంచుకోవడానికి ప్రేమికుల రోజు అనే విదేశీ విష సంస్కృతిని ఎరగా వేసి విద్యార్థి, యువతపై బలవంతంగా రుద్దుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా ప్రేమికుల రోజును బహిష్కరించి భారతీయ సంస్కృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, శ్రీహరి, కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి అభినందన



కార్యవర్గాన్ని అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి



మేయర్ హరి వెంకట కుమారిని సత్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

ఏయూక్యాంపస్: జేఏసీ ఆఫ్ బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ ఎంప్లాయిస్, టీచర్స్, వర్కర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. శనివారం ఉదయం ఏయూ కెమిస్ట్రీ విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ జి.హరి వెంకట కుమారి, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిలు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ సమస్యల సాధనకోసం ఏకతాటిపై నిలిచి పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి బీసీ,ఎస్టీ, ఎస్టీ, మైనారిటీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.బీసీ మహిళనైన తనను విశాఖ నగరానికి మేయర్‌గా నియమించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అనంతరం ఏపీ స్టేట్ గౌరవ చైర్మన్ మందారపు వెంకట రామయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు అన్యాయం జరిగితే సహించేదిలేదన్నారు.వారి పక్షాల నిలచి జేఏసీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ చైర్మన్ కేతా శ్రీనివాస రావు, నేషనల్ చైర్మన్ కస్తూరి గోపాలకృష్ణ, నేషనల్ వైస్ చైర్మన్ ఎస్.మహబూబ్ బాషా, కో చైర్మన్ డాక్టర్ రాజ మాణిక్యం, గౌరవ సలహాదారు పిట్టా వరప్రసాద్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఆచార్య టి.శోభశ్రీ, జి.వీర్రాజు, ఎస్.ఏ.డి పాల్,వి.కాంతారావు, ఎం.చంద్రశేఖర్, షాన్ బాషా,ఎస్.గోపి కృష్ణ,టి.ఈశ్వర భవాని, కె.గౌరమ్మ, తుపాకుల ప్రసాద్,జి.రామకృష్ణ,పి.నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

పారిశుధ్య కార్మికులకు రగ్గుల పంపిణీ



రగ్గులు అందజేస్తున్న మదర్ థెరిస్సా ట్రస్ట్ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డులో పారిశుధ్య కార్మికులకు మదర్ థెరిస్సా ఎవర్‌గ్రీన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రగ్గులు పంపిణీ చేశారు. వార్డు శానిటరీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జోన్-2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్‌కుమార్ పాల్గొని ట్రస్ట్ సభ్యులతో కలిసి వార్డులో 70 మంది పారిశుధ్య కార్మికులకు రగ్గులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ కార్మికులకు సహాయం అందించిన ట్రస్టు సభ్యులను అభినందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కె.ప్రసాదరావు, కార్యదర్శి బి.తాతబాబు, శ్రీనివాసరావు, వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ నాయుడు, ఏయూ ఆచార్యుడు ఎస్.ఎ.డి పాల్ పాల్గొన్నారు.

నేడు ఎరుకుమాంబ అమ్మవారి విగ్రహం ఊరేగింపు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహం ఆదివారం ఉదయం ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అల్లిపురంలో తయారు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా దొండపర్తిలోని ఆలయానికి తీసుకొస్తామన్నారు. 17వ తేదీన అమ్మవారికి క్షీరాభిషేకం, జలాభిషేకం నిర్వహించి 18వ తేదీ ఉదయం ప్రాణ ప్రతిష్ఠ చేస్తారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 10వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. లాసన్స్ బే కాలనీలోని ఎంపీ ఎంవీవీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. 10వ వార్డు శ్రీవిశ్వకర్మ సేవా సంఘం అధ్యక్షుడు కె.శశికుమార్, కార్యదర్శి మాచర్ల సాధూరావు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. గతంలో టీడీపీలో క్రియాశీలకంగా పనిచేసిన ఈ సంఘం ప్రతినిధులంతా ఎంపీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాకర్షక పాలనపై ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ, ఎంవీవీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వారిని ఎంపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శ్రీహరినగర్‌లో రోడ్లు నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న మేయర్‌హరి వెంకటకుమారి..

ఆరిలోవ: జీవీఎంసీ పదకొండో వార్డులో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శనివారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి ఆమె వార్డు పరిధి గాంధీనగర్ అన్నానగర్, కైలాసనగర్, శ్రీహరి నగర్‌లలో సామాజిక భవనాలు, సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణం కోసం ఆయా చోట్ల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పదకొండో వార్డులో ఇప్పటికే కొన్ని రూ.కోట్లు నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం మరో రూ.కోటితో వివిధ నిర్మాణాల కోసం పనులు ప్రారంభించామన్నారు. వార్డులో గాంధీనగర్‌లో రూ 46.20 లక్షలతో సామాజిక భవనం ఆధునికీకరణ, అన్నానగర్‌లో 26.25 లక్షలతో సామాజిక భవనం మొదటి అంతస్తు, సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణం, శ్రీహరినగర్‌లో రూ. 27లక్షలతో సీసీ రోడ్లు, తారు రోడ్లు, కైలాసనగర్‌లో తారు రోడ్లు, కాలువలు నిర్మించనున్నట్లు తెలిపారు.

ఆయా పనులను త్వరంగా జరిపించి వినియోగంలోకి తీసుకురావాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి విక్రయించడానికి సిద్ధం చేసిన గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఆరిలోవలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు శనివారం టాస్క్ ఫోర్స్ పోలీసులకు స్థానికుల ద్వారా సమాచారం అందింది. దీంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు అక్కడకు చేరుకొని ఆరిలోవ పోలీసుల సహకారంతో శ్రీకాంత్‌నగర్‌లో పరిశీలించారు. ఓ చోట ముళ్ల పొదలు వద్ద గుట్టుగా విక్రయానికి గంజాయి సిద్ధం చేసిన భీమిలి ప్రాంతానికి చెందిన కె.అప్పలరాజును అదుపులోకి తీసుకొన్నారు. ఆయన వద్ద నిల్వ ఉన్న 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ ఎస్.ఐ వై.కృష్ణ కేసు నమోదు చేశారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు. అప్పలరాజు పాత నేరస్థుడని పోలీసులు తెలిపారు.

నేటి నుంచి షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో నార్త్ షిర్డీ సాయాబాబా..

ఆరిలోవ: చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభంకానున్నాయి. ఈ వేడుకలు ఈనెల 13 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు ఉదయం 5 గంటలు నుంచి స్వామి పూజా కార్యక్రమాలు ప్రారంభమవు తాయని ఇక్కడ అర్చకులు భక్తులతో పూజలు చేయిస్తారని ఆలయ చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు సామూహిక సాయిసత్య వ్రతాలు జరుగుతాయన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం 6 గంటలకు స్వామివారి పల్లకీ సేవ నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామి సేవలు పాల్గొనాలని ఆయన కోరారు.